క్లుప్తంగా

అలరించిన సంగీత కచేరీ



విజయవాడకల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో సంగీత మూర్తి త్రయంలో ఒకరైన శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామివారి జయంతి సందర్భంగా సత్యనారాయణపురంలోని సంస్థ కార్యాలయంలో శనివారం సంగీత సమితి నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ సంగీత వైభవాన్ని చాటింది. సంగీత సమితి విద్యార్థినులు త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్ రచించిన కీర్తనలను వీణపై పలికించారు. సంగీత సమితి ప్రధాన కార్యదర్శి సీవీ రావ్ మాట్లాడుతూ కర్నాటక సంగీతంలో ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజస్వామిలను మూర్తిత్రయం అంటారని తెలిపారు. సంగీతానికి ఎల్లలు లేవని శాస్త్రీయ సంగీతాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసముందన్నారు. బాల బాలికలను ప్రోత్సహించడానికి జాతీయ స్థాయిలో సంగీత పోటీలను ప్రతీ ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చిన్నారి వైద్యానికి దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): సంవత్సరం వయసు గల అబ్దుల్ సఫియా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. పటమట సనత్‌నగర్‌కు చెందిన ఇమ్రాన్ చిరు ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. చిన్నారి సఫియా హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు చాలా వరకు ఖర్చు చేశారు. ఈ క్రమంలో వారు వైద్య ఖర్చుల కోసం దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. దీంతో శనివారం దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరుపున గ్రూప్ సభ్యులు యాంటీ కరప్షన్ బ్యూరో హెడ్‌కానిస్టేబుల్ ఆంజనేయులు, అజిత్‌సింగ్‌నగర్ ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ రాధాకృష్ణ హాస్పిటల్‌కు వెళ్లి రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపదలో ఉన్న పేదవారికి సహాయం అందజేసి చేయూత ఇస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యులకు బాధితురాలి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ సిటీ పోలీసు పక్షాన స్థాపించిన దీవెన ఫౌండేషన్ సభ్యులు సహాయ, సహకారాలతో పేదలకు విద్య, వైద్యం ఖర్చుల నిమిత్తం తమ వంతుగా ఆర్థిక సాయం అందజేస్తున్నామని, సహకరిస్తున్న గ్రూప్ సభ్యులందరికి ధన్యవాదాలు తెలియజేశారు.

గరికపాడు చెక్‌పోస్ట్ పరిశీలన



గరికపాడు(జగ్గయ్యపేట): ఏపీ–తెలంగాణ సరిహద్దు గల గరికపాడు చెక్‌పోస్ట్‌ను రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ శ్రీరాం మోహన్ మిశ్రా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు, మద్యం అక్రమ రవాణా సాగకుండా చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ముఖ్యంగా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట జగ్గయ్యపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు, నందిగామ ఏసిపి రవి కిరణ్ ఉన్నారు.

ప్రాంగణ ఎంపికలో 18 మందికి ఉద్యోగాలు

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 18 మందికి ఉద్యోగాలు వచ్చాయని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి తెలిపారు. ఆయన శనివారం వివరాలు తెలుపుతూ బహుళజాతి సంస్థ జనరల్ ఎలక్ట్రిక్(జీఈ) ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విభాగంలో 105 మంది విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ చాటిన 18 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఈ ఎంపికల్లో సంస్థ ప్రతినిధి జీపీ ప్రభు, కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు లాంఛనమే

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు
- సెంట్రల్‌లో భారీ ప్రచార ర్యాలీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికలో వైఎస్సార్ సీపీ గెలుపు లాంఛనమేనని, ప్రజలు ఫ్యాను గుర్తుకు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 26, 27, 28, 29, 30, 31, 32, 33, 56, 57, 58, 89, 60వ డివిజన్‌లలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్, ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లతో కలిసి శనివారం ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ నవరత్నాలతో ప్రతీ ఇంటా సంక్షేమం నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతి ఒక్కరూ ఎదురు చూస్తున్నారని అన్నారు.

టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు..

మోసం, కుట్ర, కుతంత్రాల చంద్రబాబుతో ప్రజలు విసిగిపోయారని, టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు అని వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసే జగనన్నకు ప్రజలు అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో చంద్రబాబుకు గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. మర్యాద తెలియని వ్యక్తి బొండా ఉమా అని అటువంటి వ్యక్తికి ఎన్నికల్లో ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా లేరని వెలంపల్లి అన్నారు. అధికారంలో ఉండగా కబ్జాలు, రౌడీయిజం చేసిన బొండా ఉమా అధికారంలో లేనప్పుడు కూడా దాడులకు పాల్పడటం ఆయన నైజంను తెలియజేస్తోందన్నారు. ప్రజలతో కనీసం మర్యాదగా ప్రవర్తించడం బొండాకు తెలియదని, అదే మాదిరిగా ఆయన కుమారులు కూడా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీకి ఓటు వేసి వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానిలను గెలిపించాలని కోరారు.



60వ డివిజన్‌లో ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

అపూర్వ స్వాగతం..

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ర్యాలీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దారి పొడవునా హారతులు ఇస్తూ పూలమాలలు వేసి శాలువాతో సత్కరిస్తూ స్వాగతం పలికారు. తమ కోసం ఎన్నోమార్లు బటన్ నొక్కి తమ జీవితాలలో వెలుగులు నింపిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి తాము బటన్ నొక్కి ఓట్లు వేసి మద్దతు ఇస్తామంటూ ప్రజలు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు కొంగితల లక్ష్మీపతి, కొండాయగుంట మల్లీశ్వరి, బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి, పెనుమత్స శిరీష, ఇసరపు దేవి, ఎండీ షాహినా సుల్తానా, కోఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి, పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలంతా సీఎం జగన్ వైపే

పాయకాపురం(విజయవాడరూరల్): పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే జనమంతా ఉన్నారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు శనివారం ఉదయం 64వ డివిజన్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెలంపల్లి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా ప్రజలకు అభివాదం చేసుకొంటూ ఒక్కసారి ఆశీర్వదించండి మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తా, నిత్యం అందుబాటులో ఉంటానని అన్నారు. 64వ డివిజన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ 63, 62, 61వ డివిజన్ల మీదుగా సాగింది. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ప్రతీ డివిజన్‌లో ప్రజల నుంచి తనకు నీరాజనాలు లభించాయని తెలిపారు. పథకాలకు నిధులు విడుదల చేయవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేస్తే టీడీపీ నాయకులు సంబరాలు చేసుకొన్నారని ఆరోపించారు. పేదవాళ్లకు లబ్ధి చేకూరకుండా అడ్డుకున్న ఆదేశాలపై సంతోషాన్ని వ్యక్తం చేయడంతోనే టీడీపీ నాయకుల సైకోతనం బైటపడిందన్నారు. తన కారు డ్రైవరుని రక్షించుకోలేని పవన్‌కళ్యాణ్ ప్రజలను ఏం రక్షిస్తారని వెలంపల్లి ప్రశ్నించారు. ప్రజలందరూ ఇప్పటికే జగన్‌కు ఓటు వేయాలని నిర్ణయం తీసుకున్నారని టీడీపీకి ఓటమి తప్పదన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఉత్తుత్తి హామీలు ఎన్ని ఇచ్చినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. బొండా ఉమా రౌడీయిజం రోజు రోజుకి పెరిగిపోయి పరాకాష్టకు చేరిందని విమర్శించారు. తాను సెంట్రల్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలవబోతున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. ర్యాలీలో వెలంపల్లి అల్లుడు మంచుకొండ చక్రవర్తి, అశ్విని, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ పి.గౌతంరెడ్డి, డెప్యూటీ మేయర్ అవుతు శైలజ, కార్పొరేటర్లు కేశినేని శ్వేత, యరగొర్ల తిరుపతమ్మ, అలంపూరు విజయలక్ష్మి, ఉమ్మడి రమాదేవి, షాహినాసుల్తానా, ఇసరపు దేవి, జానారెడ్డి, లక్ష్మీపతి, పెనుమత్స శిరీషా, కసపర్తి కొండ, ఉద్దంటి సురేష్, అంగిరేకుల గొల్లభామ, బంక శకుంతలదేవి, కొండాయిగుంట మల్లేశ్వరి, బాలి గోవింద్, శర్వాణిమూర్తి, కుక్కల అనిత, కోఆప్షన్ జగదీష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న వెలంపల్లి



64వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న వెలంపల్లి

మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయం

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు
- విలువలు, విశ్వసనీయతకు పట్టం కట్టాలి
- సెంట్రల్‌లో వైఎస్సార్ సీపీ భారీ రోడ్ షో



రోడ్‌షోలో మల్లాది విష్ణు, డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం తథ్యమని, జూన్ రెండో వారంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేస్తారని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు శనివారం మల్లాది విష్ణు ఆధ్వర్యంలో భారీ రోడ్ షో నిర్వహించారు. వెలంపల్లి శ్రీనివాసరావు విజయాన్ని కాంక్షిస్తూ.. దుర్గాపురం నుంచి ప్రారంభమైన ర్యాలీ మారుతీనగర్, మాచవరం, గిరిపురం, సత్యనారాయణపురం మీదుగా అయోధ్యనగర్ వరకు సాగింది. కార్యక్రమానికి వందలాదిగా జనం, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా 'జై జగన్, జైజై జగన్' నినాదాలతో వీధులన్నీ హోరెత్తాయి. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ.. విశ్వసనీయతకు, సంక్షేమానికి పెద్దపీట వేసి అన్ని విధాలా ప్రజలకు అండగా ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై మరోసారి ప్రజలందరూ అభిమానాన్ని చాటుకొని ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. సాధ్యం కాని హామీలు, అబద్ధపు మేనిఫెస్టోలతో నిత్యం ప్రజలను మోసం చేసే దగాకోరుల కూటమికి ఓటు వేసి మోసపోకుండా ప్రజలందరూ విజ్ఞతతో ఓటు వేయాలన్నారు. చంద్రబాబుకు ఓటు వేస్తే మేనిఫెస్టోను మాయం చేసి ప్రస్తుతమున్న సంక్షేమ పథకాలన్నీ అడ్రస్ లేకుండా చేస్తారని ఆరోపించారు. కానీ మొట్టమొదటిసారిగా మేనిఫెస్టోకు అర్థం చెబుతూ.. అందులో 99.4 శాతం హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చాలని మల్లాది విష్ణు తెలిపారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన ప్రతీ హామీని అధికారంలో రాగానే నెరవేర్చి.. 130 సార్లు బటన్ నొక్కారన్నారు. ప్రతి సామాజిక వర్గానికి, ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకాలు అందేలా పాలన సాగించారని వెల్లడించారు. దేశ చరిత్రలోనే ప్రభుత్వ పథకాల ద్వారా అక్కచెల్లెమ్మలకు నేరుగా 2 లక్షల 70 వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమేనని చెప్పుకొచ్చారు. యువతకు ఏకంగా 2 లక్షల 31 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించినట్లు వివరించారు. మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసిన రోజులు టీడీపీ హయాంలో చూస్తే.. మేనిఫెస్టోకు, విశ్వసనీయతకు అర్థం చెప్పిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. కనుక సంక్షేమ పథకాలన్నీ కొనసాగేలా సీఎం జగన్‌కు ఓటు వేసి మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడానికి ప్రజలందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ పైన కూటమి నేతలు చేస్తున్న ముప్పేట దాడిని తిప్పికొట్టాలన్నారు. ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ సీఎం జగనన్నకు మహిళల పూర్తి మద్దతు ఉందని, వారి సహకారంతోనే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల్లో జరగబోయే సంగ్రామంలో విశ్వసనీయతకు, సంక్షేమానికి పెద్దపీట వేసే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఎంపీగా కేశినేని నానికి, ఎమ్మెల్యేగా వెలంపల్లి శ్రీనివాసరావుకు తిరుగులేని మెజార్టీని అందించాలని కోరారు. కార్యక్రమంలో వెలంపల్లి సోదరుడు వెలంపల్లి రాఘవ, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, డివిజన్ కోఆర్డినేటర్లు, ఇన్‌ఛార్జిలు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరంలో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు కోరారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు శనివారం మల్లాది విష్ణు ఆధ్వర్యంలో కండ్రిక నుంచి డాబాకొట్లు వరకు భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ప్రచారంలో ఎక్కడికెళ్లినా అన్ని వర్గాల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల ఫలితాలతో రాష్ట్రంలోని ప్రతిపక్షాలు కనుమరుగు కావడం ఖాయమని స్పష్టం చేశారు. 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎఫ్ఎల్ ఛైర్మన్ పూనూరు గౌతంరెడ్డి, వెలంపల్లి శ్రీనివాస్ సోదరుడు వెలంపల్లి రాఘవ, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, కోఆర్డినేటర్లు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపించండి



24వ డివిజన్ ప్రచారం నిర్వహిస్తున్న మల్లాది విష్ణు, కార్పొరేటర్ అనిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకువద్దామని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని శ్రీనివాస్(నాని), వెలంపల్లి శ్రీనివాసరావుల విజయాన్ని కాంక్షిస్తూ శనివారం 24వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో రూ. 10 కోట్లుతో అభివృద్ధి పనులు చేశామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేయడంతో పాటు, రూ. వంద కోట్ల సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. అభివృద్ధి కొనసాగాలన్నా, సంక్షేమ పథకాలు పొందాలన్నా మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని విష్ణు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు చంటి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు జరుగుతున్నందున ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీవీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్ ఫీడర్ పరిధిలో శాంతినగర్, ప్రశాంతి నగర్, కండ్రిక ఫీడర్‌లో ఓల్డ్ పాయకాపురం, నూజివీడు మెయిన్ రోడ్‌లో కండ్రిక, రాధానగర్ ఫీడర్‌లో బర్మా కాలనీ, విశాలాంధ్ర కాలనీ, రాధా నగర్, డాక్టర్స్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

జగనన్నతోనే పేదల సంక్షేమం సాధ్యం



30వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న మాజీ డెప్యూటీ మేయర్ వెంకటరమణరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం జగనన్నతోనే బడుగు, బలహీన, మైనార్టీల సంక్షేమం సాధ్యమని, ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని మాజీ డెప్యూటీ మేయర్ గోగుల వెంకట రమణరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక 30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్యనగర్‌లో శనివారం ఆయన గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలు జగనన్నకు ఓటు వేసి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా బ్రాహ్మణ సామాజిక వర్గం

- ఎన్నికల్లో విజయాన్ని అందిస్తాం
- ఏపీఐడీసీ ఛైర్‌పర్సన్ పుణ్యశీల

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతే రాష్ట్రంలోని బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని ఆదరించి, గౌరవిస్తున్నారని ఏపీ ఐడీసీ ఛైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల అన్నారు. అటువంటి మంచి మనసున్న జగనన్న ప్రభుత్వానికి బ్రాహ్మణ సామాజికవర్గం యావత్తు రానున్న ఎన్నికల్లో విజయాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు. విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎన్నికల ప్రధాన కార్యాలయంలో శనివారం బ్రాహ్మణ పెద్దలతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు పాలనలో బ్రాహ్మణుల అభ్యున్నతికి రూ. 500 కోట్లు కేటాయిస్తామని ప్రకటించి కేవలం రూ. 216 కోట్లు మాత్రమే విడుదల చేశారని గుర్తు చేశారు. సీఎం జగనన్న గడిచిన 59 నెలల్లో రూ. 1000 కోట్లు ఇస్తానని చెప్పి వలంటీర్ల ద్వారా రూ. 792 కోట్లు మేరకు వివిధ సంక్షేమ పథకాలను ఇంటి వద్దే అందించారని చెప్పారు. వంశపారంపర్య అర్చకత్వ విధానాన్ని చంద్రబాబు తీసేస్తే సీఎం జగనన్న దానిని పునఃరుద్ధరించి వారిని ఆదుకున్నారని పేర్కొన్నారు. టీటీడీ పరిధిలోని పురోహితులకు 150 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇవ్వడం, దేవాలయాల్లోని అర్చకులకు రిటైర్మెంట్ లేకుండా జీవితాంతం దైవ సేవ చేసుకునే అవకాశం కల్పించిన ఘనత సీఎం జగనన్నదేనన్నారు. కృష్ణా పుష్కరాల పేరుతో చంద్రబాబు విజయవాడలో 40 గుళ్లు, గోశాల కూల్చేస్తే.. జగనన్న ప్రభుత్వంలో దేవదాయ శాఖ మంత్రిగా పనిచేసిన వెలంపల్లి శ్రీనివాసరావు వాటన్నింటిని పునర్నిర్మించారని చెప్పారు.

జగనన్న సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకునేందుకు బ్రాహ్మణ సామాజికవర్గం అంతా సిద్ధంగా ఉండాలని కార్పొరేటర్ శర్వాణీమూర్తి, మాజీ కార్పొరేటర్ గండూరి మహేష్ పిలుపునిచ్చారు. కోవిడ్ కష్టకాలంలో బ్రాహ్మణ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు దాదాపు రూ. 200 కోట్లు రుణాలు ఇచ్చి ఆదుకున్నారని గుర్తు చేశారు. అలాగే బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా చేయూత పథకం ద్వారా ఒకొక్కరికి రూ. 15వేలు చొప్పున 45వేల మంది బ్రాహ్మణ ఆడపడుచులకు రూ. 75వేలు ఇచ్చిన ఘనత సీఎం జగనన్నదన్నారు. బ్రాహ్మణ సామాజికవర్గం ఐక్య వేదిక కన్వీనర్ జింకా చక్రధర్ మాట్లాడుతూ నగరంలో బ్రాహ్మణ భవన్ నిర్మాణం ఆవశ్యకతపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని ఇటీవల కలిసి వివరించానని పేర్కొన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించడం హర్షణీయమన్నారు. సమావేశంలో హరనాథ్, సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ముస్లిం మైనార్టీలు ఓటు వేసి అండగా నిలవాలని ప్రధాన మంత్రి 15 సూత్రాల కమిటీ జిల్లా సభ్యుడు ఎస్‌కే అక్బర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ముస్లిం మైనార్టీలకు గౌరవం, సముచిత స్థానం కల్పించిన మహోన్నత వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. అటువంటి జగనన్న ప్రభుత్వానికి ఓటు వేసి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మోసాల చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ కూటమికి తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు.

నేడు దుర్గమ్మ సన్నిధిలో ఆదిశంకరాచార్యుల జయంతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద ఉదయం 8.30 గంటలకు ఆదిశంకరాచార్యుల విగ్రహానికి పంచామృత అభిషేకాలు, అర్చన నిర్వహిస్తారు. సాయంత్రం ఆది శంకరాచార్యుల విగ్రహంతో నగరోత్సవ సేవ జరుగుతుందని ఆలయ వైదిక కమిటీ పేర్కొంది.

వేసవిలో గోవులపై ప్రత్యేక పర్యవేక్షణ



దూడలను పరిశీలిస్తున్న ఈఓ రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పెరుగుతున్న ఎండలు, వడగాల్పుల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ఉన్న గోవులు, దూడలకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని దుర్గగుడి ఈఓ కేఎస్ రామరావు అన్నారు. దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలను ఈఓ రామరావు శనివారం పరిశీలించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి విగ్రహం ఆవరణలో ఉన్న రెండు గోశాలను పరిశీలించడంతో పాటు అందులో ఉన్న దూడల పరిశీలించారు. గోవులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా గోశాలలో ఫ్యాన్‌తో పాటు కూలర్‌ను అందుబాటులో ఉంచినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా ఎండ తీవ్రత అధికంగా ఉన్న తరుణంలో వాటికి వడదెబ్బ తగలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని చలివేంద్రంలో భక్తులకు పంపిణీ చేస్తున్న మజ్జిగ వితరణను పర్యవేక్షించారు.